క్లుప్తంగా

అవార్డు గ్రహీతకు సన్మానం


పాత్రికేయుడు షబ్బీర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: పట్టణానికి చెందిన ప్రజాశక్తి విలేకరి షబ్బీర్ బొమ్మరెడ్డి స్మారక అవార్డు దక్కింది. విజయవాడలో జరిగిన కార్యక్రమంలో ఆయన ఇప్పటికే అవార్డు అందుకున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక పట్టు రీలర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఆయన్ను ఘనంగా సన్మానించారు. అలాగే నూతన ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా ఎన్నికైన రామాంజినేయులును కూడా సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఖాజా, ప్రధాన కార్యదర్శి ముస్తఫా, ఉపాధ్యక్షుడు బాషా, సహాయ కార్యదర్శి దాదాపీర్, పాత్రికేయులు పాల్గొన్నారు.

పెనుకొండ సీఐగా రాఘవన్



పెనుకొండ: పెనుకొండ సీఐగా రాఘవన్ బాధ్యతలు బుధవారం స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ, అసాంఘిక కార్యకలాపాలను అణచివేసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. పలువురు ఎస్‌ఐలు, ఇతర సిబ్బంది రాఘవన్‌ను కలసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

నీరు కలుషితం కాకుండా చర్యలు

మడకశిరరూరల్: మండల పరిధిలోని మణూరు పంచాయతీలోని గ్రామాల్లో దెబ్బతిన్న వాటర్ స్కీమ్ పైపులైన్లు మరమ్మతు చేసి తాగునీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టినట్లు గ్రామ కార్యదర్శి ఆనంద్‌కుమార్ తెలిపారు. గ్రామాల్లో పర్యటించి దెబ్బతిన్న వాటర్ స్కీమ్ పైపులైన్‌ను మరమ్మతులు చేస్తున్నామన్నారు. పరిశుభ్రత, సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు.

జీఓ నంబర్ 84ను రద్దు చేయాలి


ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలుపుతున్న మున్సిపల్ ఉపాధ్యాయులు

హిందూపురం టౌన్: ఏపీఎంటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మున్సిపల్ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో బుధవారం పాఠశాల భోజన విరామంలో ప్రభుత్వ మున్సిపల్ పాఠశాలల్లో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ విద్యా వ్యవస్థను నాశనం చేసే జీఓ నంబర్ 84ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకటరెడ్డి, ఎం.రవి, ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ హిందూపురం కమిటీ అధ్యక్షుడు చంద్రానాయక్, బాలకృష్ణ, పెన్నోబలం, వేణుగోపాల్, మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు జాబ్‌మేళా

పెనుకొండ: పట్టణంలోని సత్యసాయి డిగ్రీ కళాశాలలో గురువారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఏఓ కేశవయ్య తెలిపారు. కొడికొండ చెక్‌పోస్ట్ వద్ద ఉన్న సమర్థనం దివ్యాంగుల సంస్థ ఆధ్వర్యంలో జరగనున్న మేళాలో 20 కంపెనీలు పాల్గొంటాయన్నారు. 10వ తరగతి, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, పీజీ చదివిన వారు అర్హులన్నారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు


మగ్గాన్ని పరిశీలిస్తున్న అధికారులు

సోమందేపల్లి: పవర్ లూమ్స్ యజమానులు 11 రకాల చేనేత రిజర్వేషన్ పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీ.డీ. రాజారావు తెలిపారు. మండల కేంద్రమైన సోమందేపల్లిలో బుధవారం పలు మరమగ్గాల కేంద్రాలను ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులు తనిఖీ చేశారు. వెంకటేష్ అనే పవర్ లూమ్స్ యజమాని నిబంధనలు పాటించక పోవడంతో కేసు నమోదు చేసినట్లు డీడీ తెలిపారు. అయితే అధికారులు తనిఖీకు వచ్చారని గమనించి పలువురు తమ షాపులను బంద్ చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మనోహర్, షణ్ముగం, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరం

సోమందేపల్లి: మండలంలోని తుంగోడు గ్రామంలో బుధవారం పశువైద్య శిబిరాన్ని పశు వైద్యాధికారులు ఏర్పాటు చేశారు. గర్భకోశ నివారణకు 50 ఆవులకు చికిత్స అందజేశారు. వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యులు సుధాకర్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



వెనువెంటనే శిక్షలు అమలు చేయాలి

కోల్‌కత్తాలో ట్రైనీ డాక్టరు హత్యాచారం ఘటన దారుణం. ఆ ఘటనలో నిందితులకు ఉరి శిక్ష విధించాలి. మహిళలు, విద్యార్థులపై జరిగే లైంగిక వేధింపుల కేసులు ఆలస్యమవుతే ముద్దాయిలు శిక్ష నుంచి తప్పించుకునే అవకాశాలున్నాయి. నేరం చేయడానికి ప్రాణంపై భయపడే రోజులు వస్తే నేరస్తులకు కనువిప్పు కలుగుతుంది. జరిగిన ఘటనలు సుమోటాగా పరిగణించి, నేరస్తులకు ఉరి శిక్ష విధించాలి. మహిళల్లో భయం పోగొట్టే రక్షణ చర్యలను ప్రభుత్వాలు చేపట్టాలి. కొత్తగా చట్టాలను రూపొందించాల్సిన అవసరం ఉంది.

– వన్నప్ప, సీహెచ్ఓ, పరిగి



వైద్యసిబ్బందికి రక్షణ కల్పించాలి

నేను ప్రస్తుతం అమరాపురం మండలం హేమావతి పీహెచ్‌సీలో స్టాఫ్‌నర్సుగా పని చేస్తున్నాను. ఈ పీహెచ్‌సీకి ప్రహరీ లేదు. దీంతో రాత్రిపూట అల్లరిమూకలు వచ్చి పోతుంటారు. మేము ఆస్పత్రి లోపల ఉంటాము. ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయం భయంగా పనిచేయాల్సి వస్తోంది. పీహెచ్‌సీకి ప్రహరీ నిర్మించడంతో పాటు రాత్రివేళ భయం లేకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలి.

–సుజాత, స్టాఫ్‌నర్స్, హేమావతి పీహెచ్‌సీ



సీట్లు తక్కువ .. డిమాండ్ ఎక్కువ

- బాలికల గురుకులాలన్నీ ఫుల్
- పరిమితికి మించి అడ్మిషన్లతో సిబ్బందికి తలనొప్పి
- పాఠశాలల సంఖ్య పెంచాలంటున్న విద్యార్థుల తల్లిదండ్రులు



టేకులోడు క్రాస్‌లో ఉన్న మహాత్మాజ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాల

చిలమత్తూరు: జిల్లా వ్యాప్తంగా ఉన్న మహాత్మాజ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాలలో అడ్మిషన్లు ఫుల్ అయ్యాయి. 5 నుంచి 12వ తరగతి వరకూ పాఠశాలలో విద్యార్థులు 850 మంది ఉన్నారు. ఎంట్రెన్స్ ఆధారంగా అడ్మిషన్‌లు తీసుకున్నారు. అయితే మిగులు అడ్మిషన్‌లకు రెకమెండేషన్లు పెరిగిపోవడంతో పాఠశాల యాజమాన్యానికి తలనొప్పిగా మారింది. దీంతో పరిమితికి మించి అడ్మిషన్లు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

జిల్లా వ్యాప్తంగా ఏడు స్కూళ్లు

జిల్లా వ్యాప్తంగా బాలికల ప్రత్యేక గురుకుల పాఠశాలలు ఏడు ఉన్నాయి. ఆ స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య 480 మంది మాత్రమే ఉండాలి. దీంతో అన్నిచోట్లా సీట్లకు డిమాండ్ ఏర్పడింది. ఆ పాఠశాలల్లో సీటు దొరికితే చాలని విద్యార్థుల తల్లిదండ్రులు చేయని ప్రయత్నాలంటూ ఉండవంటే అతిశయోక్తి కాదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విద్యా వ్యవస్థలో తీసుకువచ్చిన సంస్కరణల ఫలితంగా జిల్లా వ్యాప్తంగా ఎంజేపీ పాఠశాలల్లో చేర్చేందుకు విద్యార్థినుల తల్లిదండ్రులు ఆసక్తి కనబరుస్తున్నారు. పాఠశాలలో ఉన్న మెరుగైన సౌకర్యాలు, నాణ్యమైన విద్య,10, 12 తరగతుల్లో మెరుగైన ఫలితాలు సాధిస్తుండటం అందుకు కారణంగా చెప్పొచ్చు.

ర్యాంకుల ఆధారంగా సీట్లు

మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలల్లో ఎలాంటి ఆలస్యం లేకుండా అడ్మిషన్‌లు పూర్తవుతున్నాయి. ఎంట్రెన్స్‌లో మంచి మార్కులు సాధించిన వారికి ర్యాంకులు, కులాల ఆధారంగా సీట్లు కేటాయింపు చేస్తున్నారు. జిల్లాకు 480 సీట్లు మంజూరు చేస్తుంటే అంతకు మూడు, నాలుగు రెట్లు అధికంగా పాఠశాలల్లో చేరేందుకు ఎంట్రెన్స్ రాస్తున్నారు. దీని బట్టి బాలికల పాఠశాలలకు ఎంత డిమాండ్ ఉందో అర్థం చేసుకోవచ్చు. 2019తో పోలిస్తే తర్వాత ప్రస్తుతం ఆ పాఠశాలలకు డిమాండ్ పెరిగిపోయింది. సీట్లు తక్కువగా ఉండగా, డిమాండ్ మాత్రం అధికంగా ఉంటోంది. దీనికి తోడు మిగిలిన సీట్లలో చేర్పించేందుకు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు లెటర్లు కుప్పలు తెప్పలుగా వస్తున్నాయి. ఎవరికి సీట్లు ఇవ్వాలో తెలియక పాఠశాల ప్రిన్సిపాళ్లకు తలనొప్పిగా మారిపోయింది.

54 మంది ఎక్కువ

చిలమత్తూరు మండలంలోని టేకులోడు క్రాస్‌లోని మహాత్మాజ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాలలో అడ్మిషన్లు ఫుల్ అయ్యాయి. ఈ పాఠశాలలో అన్ని తరగతులకు కలిపి ఉండాల్సిన దానికన్నా 54 మంది విద్యార్థులు ఎక్కువగా ఉన్నారని సిబ్బంది లెక్కతేల్చారు. దీంతో పెనుకొండ మండలం రాంపురం వద్ద నూతనంగా ప్రారంభమవుతున్న ఎంజేపీ స్కూల్‌కు ఎక్కువగా విద్యార్థులను పంపాలని అధికారులు నిర్ణయించారు.

స్కూళ్ల సంఖ్య పెంచాల్సిందే...

ప్రస్తుతం ఎంజేపీ స్కూళ్లకు ఉన్న డిమాండ్ చూస్తుంటే ప్రభుత్వం బాలికల పాఠశాలల సంఖ్య పెంచాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. 12 తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థినుల తల్లిదండ్రులు స్తోమత లేక బాల్య వివాహాలు కూడా చేస్తున్నారు. దీంతో పాఠశాలల్లో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తే వారు డిగ్రీ వరకూ తమ విద్యాభ్యాసాన్ని ఒకే చోట పూర్తి చేసేందుకు ఆస్కారం ఉంటుందని అన్ని వర్గాల వారు అభిప్రాయపడుతున్నారు. దీనివల్ల బాల్య వివాహాలు కూడా తగ్గుముఖం పడతాయని చెబుతున్నారు.

నాడు – నేడుతో కొత్తరూపు

ఎంజేపీ స్కూళ్లలో విద్యార్థినులకు సౌకర్యవంతంగా ఉండాలన్న ఉద్దేశంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్నిచోట్లా నూతన భవనాలు నిర్మించారు. వసతి గృహాలు, జూనియర్ కళాశాల భవనాలు నిర్మాణాలు పూర్తి చేశారు. ప్రస్తుతం ఆయా పాఠశాలలను సర్వాంగ సుందరంగా దర్శనమిస్తున్నాయి.

మెరుగైన విద్య అందిస్తున్నాం



ఎంజేపీ స్కూళ్‌లోకి ప్రవేశ పరీక్ష ద్వారా విద్యార్థుల ఎంపిక ఉంటుంది. చురుకైన విద్యార్థినిలే మా పాఠశాలలో అడ్మిషన్లు పొందుతున్నారు. దీంతో వారికి తగ్గ మెరుగైన విద్యను అందిస్తున్నాం. అలాగే నాణ్యమైన పోషక విలువలున్న ఆహారాన్ని అందిస్తున్నాం. ఎప్పటికప్పుడు వారి ఆరోగ్యస్థితిపై వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నాం. ప్రస్తుతం పరిమితికి మించి విద్యార్థులు ఉన్నారు. బాలికల పాఠశాలలు మరిన్ని పెంచితే బాగుంటుంది.

– జయసింహనాయుడు, ఎంజేపీ బాలికల పాఠశాల ప్రిన్సిపాల్, టేకులోడు

నేడు పరిగిలో మాజీ మంత్రి ఉషశ్రీ పర్యటన

పరిగి: మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీ చరణ్ మండలంలో గురువారం పర్యటిస్తున్నారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి తెలిపారు. మూడు పంచాయతీల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులతో ప్రత్యేకంగా సమావేశమవుతారన్నారు. ఉదయం 9.30 గంటలకు తొలుత బీచిగానిపల్లి, 11 గంటలకు ఊటుకూరు, 12 గంటలకు ఎర్రగుంట పంచాయతీ పరిధిలో పర్యటిస్తారన్నారు.

భక్తిశ్రద్ధలతో గంధం వేడుక


గంధం మోసుకువస్తున్న దర్గా పీఠాధిపతి షేక్షావలి

పెనుకొండ: పట్టణ సమీపంలోని 44వ జాతీయ రహదారి పక్కన వెలసిన హజ్రత్ సయ్యద్ బెహలూల్ షా ఖాద్రీ షహీద్ స్వామి 827వ గంధం వేడుకలు బుధవారం తెల్లవారుజామున భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పీఠాధిపతి ఆదోని తన ఇంటి నుంచి గంధంతో భక్తులు, మత పెద్దలు, పక్కీర్లు మధ్య స్వామికి సమర్పించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ప్రార్థనల్లో పాల్గొన్నారు. పక్కీర్ల విన్యాసాలు భక్తులను ఆకట్టుకున్నాయి. దర్గా నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. మజీ ఎమ్మెల్యే అబ్దుల్‌గని, ఏజీపీ భాస్కరరెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు బాషా, మాజీ ఉప సర్పంచ్ కుళ్లాయప్ప తదితరులు ప్రార్థనల్లో పాల్గొన్నారు.

రాగి సాగుపై రైతులకు అవగాహన


రొళ్ల మండలం హులికుంటలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ కృష్ణమీనన్

రొళ్ల: బోరుబావుల్లో నీటి వసతి కలిగిన రైతులు రాగి పంట విస్తీర్ణాన్ని పెంచడానికి శ్రద్ధ తీసుకోవాలని మడకశిర డివిజన్ వ్యవసాశాఖ ఏడీఏ కృష్ణమీనన్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని హులికుంట గ్రామంలో రైతులకు రాగి పంట సాగుపై అవగాహన కల్పించారు. ఏడీఏ మాట్లాడుతూ రైతుల సేవా కేంద్రాల్లో 50 శాతం సబ్సిడీతో రాగి విత్తనాలు పంపిణీ చేస్తామన్నారు. ప్రతి క్వింటాకు రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు ధర పలికే అవకాశం ఉందన్నారు. సీఎస్‌డీటీ మహేష్, ఏఓ రాజ్యలక్ష్మీ, ఏఈఓ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ: మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో ఏడీఏ కృష్ణమీనన్ ఆధ్వర్యంలో బుధవారం రాగిపంట సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ అధికారి వీరనరేష్ మాట్లాడుతూ రాగిపంట సాగు చేస్తే ప్రభుత్వం విత్తనాలను సబ్సిడీపై అందించడంతో పాటు రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేస్తుందన్నారు.

పావగడ మున్సిపల్ చైర్మన్‌గా రాజేశ్


ఎమ్మెల్యే వెంకటేశ్, నూతన చైర్మన్ రాజేశ్‌ను అభినందిస్తున్న అభిమానులు

పావగడ: స్థానిక మున్సిపల్ నూతన చైర్మన్‌గా పట్టణంలోని 4 వ వార్డు కౌన్సిలర్ పీహెచ్ రాజేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం మీటింగ్ హాలులో బుధవారం మున్సిపల్ అధ్యక్ష, ఉపాధ్యక్ష స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో అధ్యక్ష స్థానానికి పీహెచ్ రాజేశ్, ఉపాధ్యక్ష స్థానానికి గీతా హనుమంతరాయప్ప మాత్రమే నామినేషన్ దాఖలు చేయడంతో పోటీ లేకుండా వారిద్దరూ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ఏసీ గోటూరి శివప్ప ప్రకటించారు. చైర్మన్‌గా రాజేశ్ ఎన్నిక కావడంతో అభిమానులు, కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు బాణా సంచా పేల్చి, స్వీట్లు పంచి పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకున్నారు. తన విజయానికి కారణమైన ఎమ్మెల్యే వెంకటేశ్, మాజీ మంత్రి వెంకటరమణప్పలకు రాజేష్ కృతజ్ఞతలు తెలిపారు.

చింతామణి వద్ద మినీ బస్- కారు ఢీ

- హిందూపురం వాసులకు గాయాలు

చింతామణి: మినీ బస్– కారు ఢీకొన్న ప్రమాదంలో ఓ మహిళతో సహా ముగ్గురు మృతి చెందగా 12 మంది గాయపడిన సంఘటన చిక్కబళ్లాపుర జిల్లా చింతామణి వద్ద కంచార్లపల్లి పరిధిలోని దండుపాళ్యం గేటు దగ్గర బుధవారం రాత్రి జరిగింది. శ్రీనివాసులు (45) శ్రీకాంత్ (40) పుష్ప (42) అక్కడికక్కడే మృతి చెందారు. వీరంతా నెల్లూరుకు చెందిన వారని పోలీసులు తెలిపారు. వీరు కారులో బెంగళూరు నుంచి సొంతూరికి బయల్దేరారు. ఎదురుగా ప్రయాణికులతో వచ్చిన టెంపో ట్రావెలర్ మినీ బస్ అతి వేగంతో ఢీకొట్టడంతో కారు నుజ్జునుజ్జయింది. కారులో ఉన్న ముగ్గురు చనిపోయారు. మినీ బస్‌లోని హిందూపురం, తిరుపతి, బెంగళూరుకు చెందినవారు. మినీ బస్ డ్రైవర్ నాగేంద్ర, ప్రయాణికులు కిశోర్ కుమార్, గురుస్వామి, బిందు, ఆద్య, మనుతేజస్, హిమశ్రీ, లవకుశ, విహాన్, రమ్య, జగదీశ్వరి, సోమేశ్వరరావు తదితరులు గాయపడ్డారు.

‘పురం’లో కార్డెన్ సెర్చ్

హిందూపురం అర్బన్: డీఎస్పీ కేవీ మహేష్ పర్యవేక్షణలో పోలీసులు పట్టణంలోని త్యాగరాజనగర్ కాలనీలో పోలీసులు బుధవారం కార్డెన్ నిర్వహించారు. తనిఖీల్లో రికార్డులు లేని నాలుగు ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో సీజ్ చేశారు. సీఐలు రాజగోపాల్‌నాయుడు, అబ్దుల్ కరీం, జనార్దన్ పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాలస్వామి రథోత్సవం


రథాన్ని లాగుతున్న భక్తులు

అమరాపురం: మండల పరిధిలోని దక్షిణ గొల్లహట్టిలో వేణుగోపాలస్వామి రథోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. కాంగ్రెస్ పార్టీ సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. పూజల అనంతరం భక్తులు రథాన్ని ఆలయం నుంచి రోడ్డు వరకూ లాగారు. ఈ సందర్భంగా భక్తులు బొరుగులు, బెల్లం, పండ్లను రథం మీదకు విసరి మొక్కులు చెల్లించారు. అలాగే మండలంలోని తమ్మడేపల్లి, అమరాపురంలో యాదవ కులస్తులు కృష్ణుడి చిత్రపటాన్ని ఊరేగింపు నిర్వహించారు. వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది.

కేసుల పరిష్కారానికి సహకరించండి


మాట్లాడుతున్న జిల్లా అదనపు జడ్జి శైలజ, చిత్రంలో జూనియర్ సివిల్ జడ్జి లలితాలక్ష్మి

హిందూపురం అర్బన్: కేసుల సత్వర పరిష్కారానికి న్యాయవాదులు సహకరించాలని జిల్లా అదనపు జడ్జి కంపల్లె శైలజ తెలిపారు. అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా లలితా లక్ష్మీ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా అదనపు జిల్లా కోర్టు ఆవరణంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్ అధ్యక్షతన జూనియర్ సివిల్ జడ్జి పరిచయ కార్యక్రమం జరిగింది. శైలజాతో పాటు పాటు సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్ కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయవాదులందరూ కేసుల సత్వర పరిష్కారానికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఏపీపీలు ఇందాద్, నగేష్, ఏజీపీ శ్రీనివాసరెడ్డి, సీనియర్ న్యాయవాదులు రామచంద్రారెడ్డి, నాగభూషణరావు, రంగారెడ్డి, నాగరాజురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా రాజ్యలక్ష్మి

హిందూపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా రాజ్యలక్ష్మి నియమితులయ్యారు. ప్రస్తుతం రాజ్యలక్ష్మి అమరావతిలో న్యాయశిక్షణ అకాడమీలో శిక్షణలో ఉన్నారు. త్వరలోనే ఆమె ఇక్కడ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా బాధ్యతలు చేపట్టనున్నారు.

స్కూల్‌గేట్‌కు తాళం.. విద్యార్థుల పడిగాపులు


స్కూల్ గేట్‌కు తాళాలు వేయడంతో బయట నిల్చున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

హిందూపురం: పట్టణంలోని డీబీ కాలనీలో ఈఏడాది కొత్తగా భాష్యం స్కూల్ ఏర్పాటు చేశారు. అయితే ఆ స్కూల్ ఏర్పాటు చేసిన స్థలం వివాదంలో ఉందంటూ బుధవారం కొందరు స్కూల్ గేట్‌కు తాళాలు వేశారు. దీంతో కొందరు విద్యార్థులు లోపల ఉండిపోగా ఇంటినుంచి వస్తున్న మరికొందరు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు స్కూల్ గేట్ వద్దే పడిగాపులు కాచారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడి చేరుకుని సర్దిచెప్పి స్కూల్ గేట్లు తెరిపించారు. స్థలవివాదంపై ఇరుపక్షాలు తెల్చుకోవాలని, విద్యార్థులను ఇబ్బంది పెట్టడం సరికాదని తల్లిదండ్రులు చెబుతున్నారు.

జోరుగా ఇసుక తరలింపు


బేవనహళ్లి పంట పొలాల మార్గంలో ఇరుక్కుపోయిన ఇసుక ట్రాక్టర్

హిందూపురం: మండలంలో ఇసుకాసురులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వనొచ్చినా ఎండకాసినా ఇసుక తరలింపును మాత్రం ఆపడం లేదు. ఇసుక లోడులతో పంట పొలాల నుంచి కూడా తరలిస్తుండటంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. బేవనహళ్లి నుంచి మిట్టమీదపల్లి గ్రామ పొలాల మీదుగా ఇసుక తరలింపుదారులు అడ్డదారుల్లో మార్గం ఏర్పాటు చేసుకుని నిత్యం రాత్రి వేళల్లో బేవనహళ్లి, సడ్లపల్లి తదితర గ్రామాలకు చెందిన ట్రాక్టర్లతో తరలిస్తున్నారు.

విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

అగళి: వినాయక చవితిని పురస్కరించుకుని గ్రామాల్లో గణేష్ విగ్రహాల ఏర్పాటుకు పోలీస్ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్‌ఐ వీరేష్ తెలిపారు. విగ్రహం ఏర్పాటు చేసే ప్రదేశం, ఎన్ని రోజులు ఉత్సవాలు నిర్వహిస్తారు? తదితర వివరాలతో పోలీసుస్టేషన్‌లో దరఖాస్తులు అందించాలన్నారు.

ఊటుకూరులో జ్వరాలు

పరిగి: మండలంలో ఊటుకూరులో గత కొన్ని రోజులుగా జ్వరాలు, సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. ప్రస్తుతం 12 మంది జ్వరాల బారిన పడినట్లు వైద్యులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో తహసీల్దారు హసీనాసుల్తానాతో పాటు పలువురు మండలాధికారులు బుధవారం ఆ గ్రామంలో పర్యటించారు. పారిశుధ్యం పనులు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. జ్వరంతో బాధపడుతున్న వారికి మెడికల్ ఆఫీసర్ సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో వివిధ పరీక్షలు నిర్వహించారు. ప్రాణాంతక జ్వరాలు నమోదు కాలేదని తెలిపారు.

పంచాయతీల నిర్వహణకు నిధులివ్వండి


మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ రఘునాథరెడ్డి

హిందూపురం అర్బన్: గ్రామాభివృద్ధితోనే అభివృద్ధి సాధ్యమని, అందుకు తగ్గట్లుగా పంచాయతీల నిర్వహణ, అభివృద్ధికి నిధులు మంజూరు చేసినప్పుడే మంచి ఫలితాలు సాధ్యమని వైస్ ఎంపీపీ రఘునాథరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వ సభ్య సమావేశాన్ని వైస్ ఎంపీపీ రఘునాథరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు వివిధ సమస్యలను మండలాధికారుల దృష్టికి తెచ్చారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు నాగభూషణం, ఎంపీడీఓ నరేంద్రకుమార్, ఎంపీటీసీలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

నూతన గృహాలు ప్రారంభం


ఇంటిని ప్రారంభిస్తున్న ఆర్‌డీ మల్లికార్జున

గుడిబండ: మండల పరిధిలోని సీసీ గిరి గ్రామంలో బుధవారం 8 మంది దివ్యాంగులకు ఆర్‌డీటీ సంస్థ నిర్మించి ఇచ్చిన నూతన గృహాలను రీజనల్ డైరెక్టర్ మల్లికార్జున, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ డీఎల్ యంజారేగౌడు ప్రారంభించారు. కార్యక్రమంలో ఏటీఎల్ మీనాక్షి, ఎస్‌టీఎల్ అనుసూయ, తదితరులు పాల్గొన్నారు.

వేగంగా ఈ పంట నమోదు


పంట నమోదు చేస్తున్న వ్యవసాయాధికారులు

లేపాక్షి: మండల వ్యాప్తంగా ఈ పంట నమోదు కార్యక్రమం వేగవంతంగా జరుగుతోంది. ఖరీఫ్ సీజన్–2024 సంవత్సరానికి సంబంధించి ఇప్పటి వరకూ 1760 మంది రైతులకుగాను 3180 ఎకరాల్లో పంట నమోదు చేశామని వ్యవసాయాధికారి శ్రీలత తెలిపారు. ఈ పంట నమోదును పంటలు వేసిన ప్రతి రైతు చేయించుకోవాలని సూచించారు.

మానసిక వికలాంగులపై దాడి

చిలమత్తూరు: మండలంలోని వీరాపురం పంచాయతీ వెంకటాపురం ఎస్సీ కాలనీలో దారుణం జరిగింది. మానసిక వికలాంగులైన నారాయణస్వామి, మద్దిలేటిల వరుసకు చిన్నాన్న అయ్యే ఆదినారాయణ మంగళవారం రాత్రి కర్రలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఇంటి తగాదా విషయంలో మద్యం మత్తులో దాడికి పాల్పడినట్లు స్థానికులు చెబుతున్నారు. తీవ్రంగా గాయపడిన వారిని హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

పాముకాటుతో రెండు గేదెల మృతి


మృతి చెందిన గేదెలు

రొళ్ల: షెడ్డులో ఉన్న రెండు గేదెలు పాముకాటుకు గురై మృతి చెందిన సంఘటన బీజీ హళ్లిలో చోటు చేసుకుంది. బాధిత రైతు యంజారప్ప వివరాల మేరకు.. వ్యవసాయంతో పాటు పాడి ఆవులు, గేదెలు పెంచి దాని ద్వారా వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నానని తెలిపారు. రోజు మాదిరిగానే మంగళవారం సాయంత్రం పశువులను షెడ్డులో కట్టేశానన్నారు. బుధవారం షెడ్డు వద్దకు వెళ్లి చూడగా నోట్లో నురుగు, రక్తస్రావంతో రెండు గేదెలు మృతి చెందాయన్నారు. మడకశిర డివిజన్ పశువైద్యశాఖ ఏడీ అమర్ ఘటనా స్థలాన్ని పరిశీలించి పాముకాటు వేయడం వలనే రెండు గేదెలు మృతి చెందినట్లు నిర్ధారించారు. రూ.లక్ష నష్టం జరిగిందని బాధితుడు వాపోయారు.